# ‘విద్య’లో కోల్డ్‌వార్!

**విద్యాశాఖది ఒకదారి.. విద్యాకమిషన్‌ది మరోదారి**

- రెండింటి మధ్య పెరుగుతున్న దూరం
- కమిషన్ రూపొందించిన డ్రాఫ్ట్ బిల్లుపై విద్యా శాఖ అధికారుల గుస్సా!
- కమిషన్ సిఫారసులను పట్టించుకోని సర్కార్
- మరి కమిషనెందుకు? సిఫారసులెందుకు?

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): విద్యారంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ఏర్పాటైన విద్యాకమిషన్‌కు, రాష్ట్ర విద్యాశాఖకు మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నదా? విద్యాకమిషన్ వర్సెస్ విద్యాశాఖ అన్నట్టుగా పరిస్థితి తయారైందా? ప్రస్తుత పరిస్థితిని చూస్తే అలాంటి వాతావరణమే కనిపిస్తున్నది. విద్యాశాఖకు, విద్యాకమిషన్‌కు అస్సలు పొసగడం లేదనే టాక్ వినిపిస్తున్నది. విద్యాకమిషన్ అతి జోక్యాన్ని విద్యాశాఖ జీర్ణించుకోలేకపోతున్నదనే చర్చ నడుస్తున్నది. సమీక్షలు, సదస్సుల పేరుతో విద్యాకమిషన్ హడావుడి చేస్తుండటంతో కీలక ఉన్నతాధికారులు వీటికి దూరంగా ఉంటున్నట్టు తెలిసింది. విద్యాకమిషన్ అధ్యయనం, సమావేశాలు, పర్యటనలు, తనిఖీలు, పబ్లిక్ హియరింగ్స్ పేరిట జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నది. కమిషన్ ఇప్పటివరకు ప్రభుత్వానికి ఏడు నివేదికలను సమర్పించింది. కమిషన్ సమర్పించిన నివేదికలు, సూచించిన సిఫారసుల్లో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. ఇందుకు కోల్డ్‌వారే కారణమన్న వాదనలున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యాకమిషన్ ఎందుకు? సిఫారసులు ఎందుకు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### బిల్లు రూపొందించడంపై విమర్శలు

విద్యారంగంలో చేపట్టాల్సిన సంస్కరణలపై సిఫారసులు చేయాల్సిన విద్యాకమిషన్ ఇటీవల డ్రాఫ్ట్ బిల్లును రూపొందించడం వివాదాస్పదమైంది. ప్రభుత్వం రూపొందించాల్సిన బిల్లును విద్యాకమిషన్ ఎలా రూపొందిస్తున్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. ‘తెలంగాణ ప్రైవేట్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ డ్రాఫ్ట్ బిల్లు-25’ పేరుతో విద్యాకమిషన్ ఒక బిల్లును సిద్ధం చేసింది. ఈ బిల్లు విషయంపైనే అటు విద్యాకమిషన్, ఇటు విద్యాశాఖ మధ్య అంతరం పెరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇదే రెండింటి మధ్య విబేధాలకు దారితీసిందనే చర్చ నడుస్తున్నది. వాస్తవానికి విద్యాకమిషన్ అనేది కేవలం సిఫారసులు చేయాల్సిన సంస్థ మాత్రమే. కానీ, డ్రాఫ్ట్ బిల్లును తయారుచేయడమంటే ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనన్న భావనతో ఉన్న విద్యాశాఖ వర్గాలు ఈ అంశాన్నే పక్కనపెట్టేశాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఫీజు నియంత్రణ ఇప్పట్లో సాధ్యంకాదని, వచ్చే ఏడాది వరకు ఆగాల్సిందేనన్న ప్రచారం జరుగుతున్నది. కమిషన్ సిఫారసుల ఆధారంగా బిల్లును తాము రూపొందించాల్సి ఉంటుందని, తాము చేయాల్సిన పనిని




విద్యాకమిషన్ చేస్తే ఎట్లా? అని ఒక అధికారి ప్రశ్నించడం గమనార్హం.

### కమిషన్ సిఫారసులపై స్పందించని సర్కార్

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 7% నిధులు సరిపోవని, 20% నిధులు కేటాయించాలని కమిషన్ నివేదించింది. రాష్ట్రంలో లెర్నింగ్ పావర్టీ (అభ్యాస పేదరికం) నెలకొన్నదని, విద్యారంగానికి 20% నిధులు కేటాయిస్తేనే ఈ పేదరికం నుంచి బయటపడగలమని కమిషన్ స్పష్టంచేసింది. ఈ సిఫారసులు బుట్టదాఖలయ్యాయి. తాజా బడ్జెట్‌లోనూ సర్కారు 7% నిధులే కేటాయించింది.
- ఫీజుల నియంత్రణ కోసం జిల్లా స్థాయిలో జిల్లా ఫీజు రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేయాలని, స్కూళ్లను మొత్తం ఐదు క్యాటగిరీలుగా విభజించాలని విద్యాకమిషన్ సూచించింది. స్కూళ్లను క్యాటగిరీలుగా విభజించలేమని సర్కార్ తేల్చింది. దీంతో విద్యాకమిషన్ చేసిన కసరత్తు అంతా వృథా అయ్యింది.
- స్కూళ్లతోపాటు ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లోనూ ఫీజుల నియంత్రణ కోసం కమిషన్ పలు సిఫారసులు చేసింది. అయితే, ‘నిర్దిష్ట ఫీజు’ను నిర్ణయించలేమని, ఇలా పెడితే కోర్టులు కొట్టివేస్తాయని విద్యాశాఖ ఈ సిఫారసులను తిరస్కరించింది.
- విద్యాహక్కు చట్టం సెక్షన్-12(1)సీ ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25% సీట్లను కేటాయించాలని కమిషన్ సూచించింది. దీనిపై విధివిధానాలేవీ ఇంకా సిద్ధం కాలేదు.
- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని కమిషన్ సిఫారసు చేసింది. దీనిపై సర్కార్ నుంచి ఉలుకూ పలుకూ లేదు.
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉన్నదని, ధరలను పెంచాలని కమిషన్ సూచించింది. కట్టెలపొయ్యి మీద వండొద్దని, బోర్ నీళ్లు వాడొద్దని, టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో వంట సరుకులను సరఫరాచేయాలని, కుక్ కమ్ హెల్పర్ల పారితోషికాన్ని పెంచాలని కమిషన్ సిఫారసు చేసింది. కానీ ధరల పెంపు, వసతుల కల్పన, సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కుక్ కమ్ హెల్పర్ల పారితోషికాన్ని పెంచలేదు.
- మండలానికి నాలుగు చొప్పున ప్రీ ప్రైమరీ విద్యను అందించేందుకు కొత్తగా ఫౌండేషన్ స్కూల్స్‌ను ఏర్పాటుచేయాలని, ఎల్‌కేజీ, యూకేజీ వంటి తరగతులను ఈ ఫౌండేషన్ స్కూళ్లల్లో నిర్వహించాలని కమిషన్ సూచించింది. అయితే, కొత్త విద్యాసంవత్సరంలో మండలానికి నాలుగు కాకుండా, జిల్లాకు మూడు చొప్పున వెయ్యి పాఠశాలల్లోనే ప్రీ ప్రైమరీ విద్యను ప్రారంభించనున్నారు.
- ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు ఆరేండ్లు పూర్తిచేసి ఉండాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదేండ్లు పూర్తిచేసిన వారికి అడ్మిషన్ ఇస్తున్నారు. ఆరేండ్లకు పెంచాలని కమిషన్ సూచించింది. ఇంతవరకు పట్టించుకున్న దాఖలాల్లేవు.

## సుప్రీంకోర్టులో జీవన్‌రెడ్డికి భారీ ఊరట

- పలు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్
- రాజకీయ కక్షసాధింపు చర్యలకు భయపడేదిలేదు
- అక్రమ కేసులపై న్యాయపోరాటం కొనసాగిస్తా: మాజీ ఎమ్మెల్యే

ఖలీల్‌వాడి(నిజామాబాద్), మే 14 : బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. శంకర్‌పల్లి భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, మోకిల పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆదేశాలు జారీచేసింది. దర్యాప్తునకు సహకరించాలని కోర్టు జీవన్‌రెడ్డిని ఆదేశించింది. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా నమోదైన అక్రమ కేసు అంటూ జీవన్‌రెడ్డి తరపున న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, ఎస్ నిరంజన్‌రెడ్డి, మహఫూజ్ నజాకీ చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది.

### అక్రమ కేసులతో వేధింపులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే బీఆర్‌ఎస్‌లో కీలకంగా ఉన్న జీవన్‌రెడ్డిని టార్గెట్ చేసింది. కాంగ్రెస్



నేతల ఒత్తిడి మేరకు ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను అధికారులు సీజ్ చేశారు. దీనిపై జీవన్‌రెడ్డి చేసిన న్యాయపోరాటం ఫలించి మాల్ తెరుచుకున్నది. అసలు వివాదమే లేని శంకర్‌పల్లి భూములకు సంబంధించి కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో ఎవరో ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల, మోకిల పోలీసుస్టేషన్లలో జీవన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి రజితారెడ్డి, 70 ఏండ్ల వృద్ధురాలైన జీవన్‌రెడ్డి తల్లిపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో జీవన్‌రెడ్డి సతీమణి, తల్లికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంపై జీవన్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.

### కక్షసాధింపు చర్యలకు భయపడేదిలేదు..

రాజకీయ కక్షసాధింపు చర్యలకు భయపడేది లేదని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తనపై 40 కేసుల వరకు నమోదు చేసి వేధిస్తున్నారని పేర్కొన్నారు. 70 ఏండ్ల వృద్ధురాలైన తన తల్లి ఏం తప్పు చేశారని ఆమెను మానసికంగా హింసిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పెట్టిస్తున్న అక్రమ కేసులపై న్యాయపోరాటం కొనసాగిస్తానని తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణపై కౌంటర్లు దాఖలు చేయండి

- రాష్ట్రానికి హైకోర్టు నోటీసులు జారీ
- దోస్త్ అడ్మిషన్లలో జోక్యానికి నిరాకరణ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ చట్టానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. మరోవైపు దోస్త్ ద్వారా జరుగుతున్న అడ్మిషన్ల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని సవాలు చేస్తూ మాల మహానాడు తరపున అధ్యక్షుడు జీ చెన్నయ్య, షెడ్యూల్ కులాల ఐక్య వేదిక తరపున ఉపాధ్యక్షుడు గడ్డం శంకర్ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు బుధవారం మరో



సారి విచారణ జరిపింది. వేసవి సెలవుల తర్వాత విచారణ కొనసాగుతుందని, ఈ లోగా ప్రభుత్వం తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తులు జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావుతో కూడిన వేసవి సెలవుల ప్రత్యేక డివిజన్ బెంచ్ ప్రకటించింది. తొలుత పిటిషనర్ల తరపున విద్యాసాగర్ ఇతర సీనియర్ న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, ఎస్సీ వర్గీకరణ చట్టంతోపాటు దాని అమలుకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన జీవో 33, జీవో 9, 10, 99 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. ప్రస్తుతం పలు విశ్వవిద్యాలయాల పరిధిలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి దోస్త్ తొలి దశ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, జూన్ 13న తరగతులు ప్రారంభం కానున్నాయని, ఆ అడ్మిషన్లలో ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కనీసం సీట్ల కేటాయింపు చేయకుండా ఆదేశాలివ్వాలని కూడా కోరారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే దోస్త్ అడ్మిషన్లకు అవరోధాలు ఏర్పడతాయని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్లు చట్టాన్ని సవాల్ చేసిన సందర్భంలో కోర్టులు ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వుల జారీకి ఆస్కారం ఉండదని అన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు పలుమార్లు ఉత్తర్వులు జారీచేసిందని గుర్తు చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ యూనివర్సిటీల పరిధిలోనిదని, విద్యా సంవత్సరం షెడ్యూలు ప్రకారం అడ్మిషన్లు కొనసాగిస్తాయని చెప్పారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోరాదని కోరారు. వాదనల అనంతరం హైకోర్టు, ఎస్సీ వర్గీకరణతోపాటు పిటిషనర్లు లేవనెత్తిన అన్ని అభ్యంతరాలపై సమగ్ర వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను నిలుపుదల చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా వేసింది.

## బాధితులు కానప్పుడు పిల్ ఎలా వేస్తారు?

- వేసవి తరగతులు నిర్వహిస్తున్నారన్న పిటిషనర్లపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): వేసవి సెలవుల్లో ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నాయంటూ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన పిటిషనర్లపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్లు బాధితులు కానప్పుడు హైకోర్టుకు ఎలా వస్తారని జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం ప్రశ్నించింది. వేసవిలో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడితే వాళ్లు లేదా వాళ్ల తల్లిదండ్రులు కాకుండా మీరెలా కోర్టుకు వస్తారని నిలదీసింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

## ‘మైలాన్’పై కఠిన చర్యలొద్దు

**పీసీబీకి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): మైలాన్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ (మ్యాట్రిక్స్ ల్యాబొరేటరీస్) సంస్థకు విద్యుత్తు సరఫరా నిలిపివేయవద్దని, ఆ కంపెనీపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిని ఆదేశించింది. ఇటీవల ఆ కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంపై పూర్తి వివరాలతో నివేదిక దాఖలు చేయాలని పీసీబీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## సర్వీస్ సెక్టార్‌ను సరళీకృతం చేయాలి

- ప్రాపర్టీస్, చెరువులు, నాలాలను మ్యాపింగ్ చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లో సర్వీస్ సెక్టార్‌ను సరళీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అక్కడ లైడార్ సర్వే చేపట్టాలని పేర్కొన్నారు. ప్రాపర్టీలతోపాటు చెరువులు, నాలాలను పక్కాగా మ్యాపింగ్ చేసే అంశంపై దృష్టిసారించాలని అన్నారు. సింగిల్ బిల్డింగ్ వ్యవస్థ, సులభతరమైన అనుమతులపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, ఎలక్ట్రిసిటీతోపాటు ఏయే విభాగాలను చేర్చాలో.. ఆయా అంశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే నిపుణుల కమిటీని నియమించుకోవాలని తెలిపారు. అలాగే ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.